క్లుప్తంగా

ఉమానీలకంఠేశ్వరాలయ హుండీ ఆదాయం రూ.3.14 లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న శ్రీహరి సేవకులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవాని పాలెం ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో పర్యవేక్షణాధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యనిర్వహణాధికారి పైలా శేఖర్‌బాబు పర్యవేక్షణలో సోమవారం హుండీ ఆదాయం లెక్కించారు. 145 రోజులకు గానూ రూ.3,14,369 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ చైర్మన్ నక్క అప్పలరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు మొంటూరి సంతోష్‌బాయి, నక్క జ్యోతి, కె.అప్పలనర్సమ్మ, అర్చకులు వి.ఉమామహేష్, సిబ్బంది శేఖర్, శ్రీహరి సేవకులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌తో టెన్త్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, దాతలు

సీతంపేట: అబుదాబి దేశంలో నివసిస్తున్న వకుళాభరణం సిరిపురపు బలరామకృష్ణ, జయలక్ష్మి, ఐశ్వర్యలు అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు సోమవారం రూ.25 వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. దీనిని పూర్తి స్థాయిలో వినియోగించుకుని పరీక్షల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీ సరస, ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, ఎ.జె.జ్యోతి, ఆర్.రాధిక, పి.పద్మలత, కె.మాణిక్యం, ఎ.రామలక్ష్మి, పి.లలిత, ఎం.ధర్మారావు పాల్గొన్నారు.

'స్పందన'కు 15 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆనందకుమార్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 15 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.ఆనందకుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, వీఆర్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో జేసీఐ వైజాగ్ అచీవర్స్ సేవలు

దాబాగార్డెన్స్: జేసీఐ వైజాగ్ అచీవర్స్ తమ సేవలు గిరిజన ప్రాంతాలకు విస్తరించింది. జేసీఐ ఆధ్వర్యంలో అనంతగిరి మండలం గరిగుడి గ్రామంలో గిరిజనులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు గుర్తించి ఆయా గ్రామానికి రూ.లక్షతో ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నట్టు సంస్థ ప్రెసిడెంట్ దిలీప్‌కుమార్ తెలిపారు. వసుధ ఫౌండేషన్ సీఎస్ఆర్ ద్వారా అందిస్తున్న రూ.లక్షను వినియోగించి ఈ కార్యక్రమం చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనంతగిరిలో నిర్వహించిన కార్యక్రమంలో జేసీఐ వైజాగ్ అచీవర్స్ ప్రతినిధులు రంజిత్‌సాహూ, డాక్టర్ శీతల్, ప్రేరణ పాల్గొన్నారు.

10న గ్రాండ్ ఫెస్ట్ 2కే24

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మహిళా జూనియర్ కళాశాలలో దగ్రాండ్ ఫెస్ట్- 2కే24 బుధవారం నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కాసు సోమవారం తెలిపారు. ఉదయం నుంచి కళాశాల ఆవరణలో విద్యా, సంస్కృతి, సంప్రదాయాలు వంటి అంశాల్లో విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన 900 మంది విద్యార్థులు ఈ ఫెస్ట్‌లో పాల్గొంటారని చెప్పారు.

నాడు టీడీపీ పాలనలో..
- పింఛన్ అర్హత వయసు 65 ఏళ్లు.
- కొత్త పెన్షన్ పొందాలంటే క్లస్టర్‌లో ఎవరైనా చనిపోవాలి.
- జన్మభూమి కమిటీని ప్రసన్నం చేసుకోవాలి.
- పింఛన్‌గా అందజేసే సొమ్ము రూ.1,000.
- కొత్త పింఛన్లు ఎన్నికల ముందు మాత్రమే మంజూరు చేసేవారు.
- కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది.

నేడు వైఎస్సార్‌సీపీ సుపరిపాలనలో..
- పింఛన్ అర్హత వయసు 60 ఏళ్లు.
- అర్హత ఉంటే కొత్త పెన్షన్ ఎప్పుడైనా పొందవచ్చు.
- ఇంటి వద్ద నుంచే వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటి వద్దే పెన్షన్ డబ్బులు అందుకోవచ్చు.
- అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగక్కర లేదు.
- పింఛన్‌గా అందజేసే సొమ్ము రూ.3 వేలు.



వైఎస్సార్ పెన్షన్ కానుక నమూనా చెక్కు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, బాణాల శ్రీనివాసరావు, కటుమూరి సతీష్, కార్పొరేటర్లు



కార్యక్రమానికి హాజరైన పింఛన్‌దారులు, సచివాలయ సిబ్బంది

అర్హతే ప్రామాణికంగా పింఛన్లు

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- నియోజకవర్గంలో కొత్తగా 384 మందికి పెన్షన్ల మంజూరు
- మొత్తంగా 19,225 మందికి వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ
- ప్రతి నెలా లబ్ధిదారులకు అందజేస్తున్న సొమ్ము రూ.5.76 కోట్లు

సీతంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నట్టు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. ఉత్తర నియోజకవర్గంలో 384 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం కొత్తగా వైఎస్సార్ పెన్షన్లు మంజూరు చేసింది. జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు అధ్యక్షతన 44వ వార్డు అక్కయ్యపాలెం అబిద్‌నగర్‌లోని షాదీఖానాలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కొత్త లబ్ధిదారులకు కె.కె.రాజు చేతుల మీదుగా పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గంలో ఇప్పటి వరకు 18,841 మందికి వివిధ రకాల పింఛన్లు అందజేస్తున్నారని, కొత్తగా మరో 384 మందికి మంజూరయ్యాయని చెప్పారు. వీటితో కలిపి 19,225 మంది వైఎస్సార్ పెన్షన్ కానుక అందుకుంటున్నారన్నారు. ప్రతి నెలా పెన్షన్ లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.5,76,75,000 ను అందజేస్తోందని వెల్లడించారు.

జగనన్న పాలనలో ఇంటికే పింఛన్..

టీడీపీ ప్రభుత్వ హయాంలో చాలా తక్కువ మందికి పింఛన్లు ఇచ్చేవారని, జన్మభూమి కమిటీ సభ్యులను గానీ, టీడీపీ నాయకులను గాని బతిమలాడుకుని, ప్రసన్నం చేసుకుంటే అతికష్టం మీద కొత్త పింఛన్ మంజూరయ్యేదని కె.కె.రాజు గుర్తుచేశారు. 2019లో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టాక పరిస్థితి మారిపోయిందని, కుల, మత రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరవుతున్నాయని పేర్కొన్నారు. నాలుగు దఫాల్లో రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు పింఛన్ సొమ్ము పెంచి లబ్ధిదారులకు ఇళ్ల వద్దే వలంటీర్ల ద్వారా అందజేస్తున్నారన్నారు. పింఛన్లు ఒక్కటే కాకుండా కడుపులో ఉన్న బిడ్డ నుంచి అవ్వాతాతల వరకు నవరత్నాలు ద్వారా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని తెలిపారు.

వెంటిలేటర్‌పై టీడీపీ

టీడీపీ వెంటిలేటర్‌పై ఉందని, దానిని బతికించుకోడానికి పచ్చ మీడియాతో కలిసి దుర్మార్గంగా వ్యవహరిస్తోందని కె.కె.రాజు మండిపడ్డారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కూడా అడ్డుకోవాలని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు కోర్టులో కేసులు వేశారన్నారు. రాజకీయ వారసత్వాన్ని నిలబెట్టుకోవడానికి టీడీపీ కుట్రలు పన్నుతూ, ప్రభుత్వంపై బురద జల్లుతోందని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమం భవిష్యత్‌లో కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

మేలు మరవద్దు

డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పాలనలో అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఇంటి వద్దే అర్హుల గుర్తింపు, ఇంటి పింఛన్ల పంపిణీ చేస్తున్నారన్నారు. ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో ఎన్నికల ముందు మాత్రమే కొత్త పెన్షన్లు మంజూరు చేసేవారని, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు పింఛన్ వయసు తగ్గించి సచివాలయ వ్యవస్థ ద్వారా దరఖాస్తు చేసుకునే వీలు కల్పించారన్నారు. మేలు చేసిన నాయకుడిని మర్చిపోకుండా ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలంతా తమ మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, ఏపీడీ పద్మావతి, స్టాండింగ్ కమిటీ మెంబర్ చల్లా రజని, కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, సారిపిల్లి గోవింద్, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, పెద్దిశెట్టి ఉషశ్రీ, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, కె.వి.ఎన్. శశికళ, జోనల్ మహిళా విభాగం ఇన్‌చార్జి పీలా వెంకటలక్ష్మి, పార్టీ వార్డు అధ్యక్షులు పైడి రమణ, నీలి రవి, సీనియర్ నాయకులు, మండలాధ్యక్షులు, కన్వీనర్లు, కార్పొరేషన్ డైరెక్టర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

భర్త పింఛన్ నాకు ఇచ్చారు



కూలిపని చేస్తూ చిన్న గుడిసెలో ఉంటున్నాను. నా భర్త మే నెలలో చనిపోయారు. అప్పటి వరకు నా భర్తకు పింఛన్ వచ్చేది. వలంటీర్ వచ్చి నా పేరుకు పింఛన్ మార్చుకోవాలని దరఖాస్తు పెట్టించారు. కుల ధ్రువపత్రం కూడా వలంటీర్ వరుణే చేయించాడు. మొదటి సారి రూ.3 వేల పింఛన్ అందుకున్నాను. చాలా ఆనందంగా ఉంది.
– గేదెల అప్పల నర్సయ్యమ్మ, మారుతీనగర్, 14వ వార్డు

పెన్షన్ మంజూరు ధైర్యానిచ్చింది



నా భర్త పేరు మీద ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా పెన్షన్ మంజూరు కాలేదు. నాకు 60 ఏళ్లు పూర్తి కావడంతో సెప్టెంబరులో వలంటీర్ దరఖాస్తు చేయించారు. ఈరోజు రూ.3 వేల పెన్షన్ డబ్బులు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. నా భర్త వయసు పైబడి ఏ పనికి వెళ్లలేడు. నా కూతురు చనిపోవడంతో తన ముగ్గురు కూతుళ్ల బాధ్యత నాపై ఉంది. ఇటువంటి సమయంలో పెన్షన్ మంజూరు కావడం ధైర్యాన్నిచ్చింది.
– లంకా పార్వతి, సీతంపేట, 25వ వార్డు

పింఛనే జీవనాధారం



నేను చీపుర్లు అమ్ముతుంటాను. నా భర్త కూలి పని చేసేవారు. ఈ మధ్య ఆయన చనిపోయారు. వితంతు పెన్షన్‌కు రెండు నెలల కిందట వలంటీర్ వచ్చి దరఖాస్తు పట్టుకెళ్లాడు. ఈ రోజు మొదటి సారి రూ.3 వేలు పెన్షన్ అందుకున్నాను. పాపకు పెళ్లయిపోయింది. కొడుకులు లేరు. ఏ ఆధారం లేని నాకు జగన్‌బాబు బాధ్యత తీసుకుని రూ.3 వేల పింఛన్ ఇస్తున్నాడు. రుణపడి ఉంటాను.
– కిమిడి సరోజిని, లెప్రసీ కాలనీ, 45వ వార్డు.

10 రోజులకే పెన్షన్ మంజూరైంది



ఆటో నడుపుతుంటాను. నాకు 61 ఏళ్లు వచ్చిన 10 రోజులకే పింఛన్ మంజూరైంది. రూ.3 వేలు పెన్షన్ డబ్బులు అందజేశారు. ఇంత త్వరగా పెన్షన్ వస్తుందని అనుకోలేదు. భార్యతో కలిసి అద్దెంట్లో ఉంటున్నాను. నాకు ఇద్దరు అమ్మాయిలు, ఒక కొడుకు. వారి బతుకు వాళ్లు బతుకుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ డబ్బులు, రేషన్‌తో ఇల్లు గడిచిపోతుంది.
– బత్తిన తవుడు, శ్రీనివాసనగర్, 44వ వార్డు

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు



ఎన్ఎంసీహెచ్ స్కూల్ మైదానంలో సంబరాలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సీతమ్మధార: జీవీఎంసీ పాఠశాలలకు మంగళవారం నుంచి పండగ సెలవులు ఇవ్వడంతో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. 24వ వార్డు నక్కవానిపాలెం జీవీఎంసీ స్కూల్, పీ అండ్ టీ కాలనీలోని ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు భోగి మంట వేసి సందడి చేశారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మన సంస్కృతి, సంప్రదాయాలు మరింత ఆదరణ పొందేలా సంక్రాంతి పండగ విశిష్టత చాటిచెప్పేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని ఉపాధ్యాయులు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆడిపాడి గాలిపటాలు ఎగురవేశారు.

ముచ్చటైన రంగవల్లులు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



ముగ్గు వేస్తున్న మహిళలు

మురళీనగర్: మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వైశాఖి స్పోర్ట్స్ పార్కులో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పార్క్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో మహిళలు సంక్రాంతి పండగను ప్రతిబింబించే విధంగా ముచ్చటైన రంగవల్లులు వేశారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి ఈ నెల 14న నిర్వహించే భోగి సంబరాల్లో బహుమతులు అందిస్తామని వనిత వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పొందూరు ప్రభావతి తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి జయ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు రేపు

మురళీనగర్: మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి లలితారెడ్డి, సీహెచ్ లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు బాలభాను పాఠశాల సమీపంలోని హరిత పార్కులో పోటీలు ఉంటాయన్నారు. మురళీనగర్, మాధవధార మహిళలు పాల్గొనవచ్చని చెప్పారు. పోటీలో పాల్గొనేవారు ముగ్గు పిండి, రంగులు వారే తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఇద్దరు కలిపి ఒక ముగ్గు వేయడానికి అనుమతిస్తారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి సహాయకురాలితోపాటు బహుమతులు అందిస్తారు. వివరాలకు 91210 07683, 92950 80808, 76619 92842 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

సీఎం ఆకాంక్షలకు అనుగుణంగా ఏయూ అభివృద్ధి



మాట్లాడుతున్న ఏయూ వీసీ ఆచార్య సమత

ఏయూక్యాంపస్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం అభివృద్ధికి నిరంతరం పని చేస్తున్నామని ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత అన్నారు. సోమవారం తన కార్యాలయంలో వర్సిటీ అధికారులు, డీన్‌లతో ఆమె మాట్లాడారు. విద్యా రంగానికి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పనిచేస్తున్నారని, ప్రతి కుటుంబం నుంచి ఉన్నత విద్యావంతులు రావాలని ఆశిస్తున్నారని చెప్పారు. దీనిని సాకారం చేసే దిశగా విశ్వవిద్యాలయంలో పటిష్ట బోధన వ్యవస్థతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. ఇటీవల ఏయూను సందర్శించిన బంగ్లాదేశ్ దౌత్య అధికారి ఏయూలో పటిష్ట బోధన వ్యవస్థను చూసి ప్రశంసించారని ఆమె చెప్పారు. భవిష్యత్తులో విశ్వవిద్యాలయం అభివృద్ధికి దోహదపడే పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి సమర్థవంతంగా నిర్వర్తిస్తామన్నారు. ఈ ప్రక్రియలో అందరి సహకారం, సూచనలు స్వీకరించి సమష్టిగా ఆంధ్రవిశ్వవిద్యాలయం ప్రగతికి బాటలు వేస్తామని ఆమె చెప్పారు.

రీడింగ్ రూమ్ పరిశీలన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రీడింగ్ రూమ్‌ని రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ సోమవారం సందర్శించారు. రీడింగ్ రూమ్‌లో చదువుకుంటున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. గ్రంథాలయం, రీడింగ్ రూమ్‌లలో నూతనంగా ఏర్పాటు చేసిన వసతులను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నతంగా రాణించాలని విద్యార్థులకు రిజిస్ట్రార్ సూచించారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'గ్రీవెన్స్'



మహిళ సమస్యలు తెలుసుకుంటున్న కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. కె.కె.రాజు వాటిని పరిశీలించి కొన్నింటిని తక్షణం పరిష్కరించారు. మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కాలుష్య రహిత విశాఖే లక్ష్యం



బంగ్లా నుంచి ప్రధాన కార్యాలయానికి సైకిల్‌పై వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: కాలుష్య రహిత విశాఖ లక్ష్యంగా.. పర్యావరణ పరిరక్షణ దిశగా జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సోమవారం బంగ్లా నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సైకిల్‌పై వెళ్లారు. విధులు అనంతరం నడక మార్గాన ప్రధాన కార్యాలయం నుంచి బంగ్లాకు చేరుకున్నారు. కాలుష్య నియంత్రణకు కనీసం వారంలో ఒక రోజు నగర ప్రజలు తమ సొంత వాహనాలు విడిచి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా కమిషనర్ కోరారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం



అర్జీదారు సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 05 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 04, ఇంజినీరింగ్‌కు 01, చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1 టి.ఎస్.ఎస్.రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్‌వోలు బాబురావు, రాజ్యలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఎస్ఎస్ జనార్దన్, ఇంజినీరింగ్ ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, డీఈ భరణికుమార్, టౌన్ ప్లానింగ్ టీపీవో అసిస్టెంట్ అపరంజిత, టీపీఆర్‌వో ఏపీడీ పద్మావతి, వాటర్ వర్క్స్ ఈఈ శేఖర్, ఏఈ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విష్ణుకుమార్‌రాజు

మద్దిలపాలెం: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా సోమవారం 51వ వార్డు మాధవ స్వామి కల్యాణ మండపంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ఈ యాత్ర ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన లేకపోవడం, ఆయా ప్రాంతాల్లో లబ్ధిదారులకు లబ్ధి చేకూరడం లాంటివి కేంద్ర ప్రభుత్వం దృష్టికి వచ్చాయని చెప్పారు. అందరికీ అన్ని పథకాల లబ్ధి చేకూరేలా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కేంద్రం ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వాటి ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు ఏపీడీ పద్మావతి, పార్టీ ఉత్తర నియోజకవర్గ కన్వీనర్ సురేష్ బాబు, కో కన్వీనర్ రాంబాబు, వార్డు నాయకులు కూన వెంకటరావు, సనపల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మికి విశేష పూజలు



దాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల 26వ రోజు సోమవారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, 6 నుంచి 11 గంటల వరకు సర్వదర్శనం, 11.30 నుంచి 12 గంటల వరకు అమ్మవారికి పంచామృతాభిషేకం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 2500 మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ధర్మప్రచార మాసోత్సవాల్లో భాగంగా సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ పాల్గొన్నారు.

11న మహాన్నదానం

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా చివరి గురువారం (ఈ నెల 11న) మహాన్నదానం నిర్వహించనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి టౌన్ కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయం వద్ద 20 వేల మంది భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేయనున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు.

పాత చలానాలు రద్దు చేయాలి

సీతమ్మధార : ఆటో డ్రైవర్లపై ఉన్న పాత చలానాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఏఐటీయూసీ) నాయకులు ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ డ్రైవర్లపై వేల రూపాయల జరిమానా వేసే జీవో నంబర్ 21ను రద్దు చేయాలన్నారు. వ్యాన్లు, లారీలు, కార్లు, జీపులకు 30 శాతం ట్యాక్స్ పెంచుతూ విడుదల చేసిన జీవో నంబర్ 31ని ఉపసంహరించుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న ఆటో డ్రైవర్లకు జగనన్న ఇల్లును వెంటనే మంజూరు చేయాలన్నారు. భారీగా పెంచిన డీజిల్, పెట్రోల్, వంటగ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు తదితరులు

సీతమ్మధార : విశాఖ సిటీ వైడ్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ (డైమండ్ పార్కు) ప్రెసిడెంట్ మద్ది రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కేకే రాజు సోమవారం ఆవిష్కరించారు. దొండపర్తి సమీప సంగం, శరత్ థియేటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి మహేష్‌బాబు, కృష్ణ అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో థియేటర్ మేనేజర్లు సుధాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, మామిడి శ్రీను, రామచంద్రరావు, జీవీఎంసీ ప్రసాద్, నున్న కృష్ణ, కాజా, నాని, నగేస్, అమర్, సంపంగి శ్రీనివాసరావు, నీలి రవి తదితరులు పాల్గొన్నారు.